క్లుప్తంగా

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం



అప్పన్న కల్యాణ ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

అప్పన్నను దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యేలు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో వారి పేరిట అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అధికారులు అందజేశారు. 98వ వార్డు కార్పొరేటర్ పి.వి.నరసింహం, సతివాడ శంకరరావు వారి వెంట ఉన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి



మాట్లాడుతున్న ఆచార్య బాలమోహన్‌దాస్

సీతంపేట: పర్యావరణాన్ని కాపాడుకోలేక పోతే మానవజాతి మనుగడకే ప్రమాదమని నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో పర్యావరణ పరిరక్షణపై జరిగిన కవి సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా పేర్కొన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. సహృదయ సాహితి అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ గాలి, నీరు నేల పంచభూతాలను మనిషి కలుషితం చేస్తున్నాడన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం అడవుల పరిరక్షణ, మొక్కల పెంపకం జరగాలని, ప్లాసిక్ వస్తువుల వినియోగం ఆపాలని కోరారు. కార్యక్రమంలో కవులు, రచయితలు కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, ఎస్.విజయ్‌కుమార్, చింతా ప్రభాకర్, చిన సూర్యనారాయణ, కొత్తూరు రమణ తదితరులు పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో విత్తన బంతులు



మురళీనగర్ కొండ ప్రాంతంలో విత్తన బంతులు చల్లుతున్న మానవ సేవే మాధవ సేవ సభ్యులు

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ దినోత్సవం సందర్భంగా సహజసిద్ధ అడవులు పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నారు. సంఘ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం సభ్యులు విత్తన బంతులను మురళీనగర్ పరిసరాల్లోని కొండ ప్రాంతాల్లో విసిరి, కొన్ని చోట్ల రహదారులను ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశాల్లో చింత, రాగి, జామ, మర్రి, సపోటా, దానమ్మ విత్తనాలను నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు డి.వరప్రసాద్, ఎస్.సీతారామకృష్ణ, ఉప కార్యదర్శి పి.సంతోష్‌కుమార్, నిర్వహణ కార్యదర్శి బి.వెంకటేశ్వరావు, కోశాధికారి కె.వి.వర్మ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



మొక్క నాటుతున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ



పాట్ పెయింటింగ్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



పర్యావరణ పరిరక్షణ ప్లకార్డులతో విద్యార్థులు



మొక్క నాటుతున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

పరవాడ: పర్యావరణ పరిరక్షణ బాధ్యతను విద్యార్థులు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. పరవాడ మండలం వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో ఎకో క్లబ్ మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణంపై విద్యార్థులు ప్రతిజ్ఞ చేయడం ఎంత ముఖ్యమో వాటిని ఆచరించడం కూడా అంతే ముఖ్యమన్నారు. పర్యావరణంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భూమి, నీరు, పర్యావరణ పరిరక్షణ అంశాలపై విద్యార్థులు చైతన్య వంతులు కావాలన్నారు. సర్వశిక్షా అభియాన్, జిల్లా విద్యా శాఖ, ఏపీఎస్‌జీసీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటారు. అనంతరం మానవహారంగా ఏర్పడి పర్యావరణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ సీఎంవో బి.శకుంతల, పరవాడ ఎంఈవో దివాకర్రావు, ఏపీఎస్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.ఖగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు పందిరి కనకేశ్వరరావు, క్లస్టర్ కోఆర్డినేటర్ బి.అన్నాజీరావు, ఉపాధ్యాయులు శ్యామసుందర్, బి.ఎస్.నాయుడు, పాత్రుడు, కూర్మారావు, అప్పలనాయుడు, ఎస్.ఎన్.రెడ్డి, అప్పలరాజు, ఇందిర, వరలక్ష్మి, ఉమా, సౌజన్య, పుణ్యవతి పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

పెందుర్తి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు డ్రాయింగ్, వ్యకృత్వ, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు. ఆర్జేడీ బి.విజయ్ భాస్కర్, జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, డిప్యూటీ ఈవో కె.సువర్ణ, జిల్లా సహ అకడమిక్ మానిటరింగ్ అధికారి కె.లక్ష్మి, పెందుర్తి ఎంఈవో–2 మధుమూర్తి, హెచ్ఎం సీహెచ్. చిన్నమ్మాయి, రాష్ట్ర గ్రీన్ కాప్స్ కో ఆర్డినేటర్ ఎస్.బాబూరావు, జిల్లా సైన్స్ అధికారి కప్పల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం గ్రంథాలయంలో..

సబ్బవరం: విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించడం వల్ల వారిలో సృజనాత్మకతతో పాటు పోటీతత్వం పెరుగుతుందని గ్రంథాలయ అధికారి వి. శిరీష అన్నారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పేపర్ రీడింగ్, నీతి కథలు రాయడం ,పాట్ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు.అనంతరం విద్యార్థులతో కలిసి గ్రంథాలయం, మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

2030 నాటికి 100 మిలియన్ల మొక్కలు నాటడమే లక్ష్యం



వేడుకల్లో పాల్గొన్న గంగవరం పోర్టు ప్రతినిధులు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యంలో 2030 నాటికి 100 మిలియన్ల మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నామని పోర్టు ప్రతినిధులు తెలిపారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి పునరుద్ధరణ, కరువును తట్టుకోవడం అనే అంశాలపై గత నెల 30 నుంచి ఈ నెల 5 వరకూ వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బీచ్ ఫ్రంట్ క్లీనింగ్‌లో భాగంగా వలంటీర్ల సహకారంతో గంగవరం బీచ్‌ను శుభ్రం చేశారు. అక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఏరివేశారు. విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం గంగవరం పోర్టు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

ఉక్కు కర్మాగారాన్ని కాపాడుకుంటాం



దీక్షా శిబిరంలో పాల్గొన్న పోరాట, పరిరక్షణ కమిటీ నాయకులు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ఊపిరి ఉన్నంత వరకు కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు ఎం.రామారావు, డీసీహెచ్.వెంకటేశ్వర్లు అన్నారు. కార్మికుల జీవితాలతో ఆడుకోవాలనుకుంటే కార్మికులతో పాటు రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల సారథ్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో భాగంగా 1210వ రోజు, బుధవారం శిబిరంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి దేశ ప్రజలు గుణపాఠం నేర్పారన్నారు. ఆరోగ్యకరంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయాలనుకుంటే ఎవరికైనా ఇదే గతి పడుతుందన్నారు. కార్యక్రమంలో డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కథలు, కవితల పోటీలు

అగనంపూడి: అగనంపూడికి చెందిన కంచిపాటి గురుమూర్తి మూడో వర్ధంతి సందర్భంగా కథలు, కవితల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు ఆయన కుమారుడు, యువ రచయిత కంచిపాటి వెంకట్ తెలిపారు. జిల్లా స్థాయిలో నిర్వహించే ఈ పోటీల్లో పాల్గొనేవారు తమ రచనలను ఈ నెల 15వ తేదీలోగా 94908 05404 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించాలని లేదా venkat1676@gmail.comకు మెయిల్ చేయాలని కోరారు. కథలకు సంబంధించి రచయితలు ఇష్టమైన అంశాన్ని తీసుకోవచ్చని, 8 వందల పదాలకు తగ్గకుండా, 12వందల పదాలకు మించకుండా ఉండేలా చూడాలని తెలియజేశారు. వీలైనంత వరకు తెలుగు భాషను మాత్రమే వాడాలని సూచించారు. కవితల పోటీలకు సంబంధించి సామాజిక అంశాల్లో ఏదైనా ఒక అంశాన్ని తీసుకొని 15 పాదాలకు తగ్గకుండా 25 పాదాలకు మించకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. కథలు, కవితల పోటీల్లో మొదటి ముగ్గురు విజేతలకు నగదు బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులు అందిస్తామన్నారు. రచయితలు తమ రచనలు పంపించేటప్పుడు ఆ పేపరుపై వారి పేరు రాయకూడదని తెలిపారు. దానికి వేరే ధ్రువపత్రం ఇవ్వాల్సి ఉంటుందని, అందులో మాత్రమే రచయిత పేరు, చిరునామా రాయాలని స్పష్టం చేశారు. విజేతలకు ఈ నెల 22న గురుమూర్తి వర్ధంతి సందర్భంగా అగనంపూడి సీడబ్ల్యూసీలో నిర్వహించే కార్యక్రమంలో బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు.

ఫ్లైఓవర్ కింద గందరగోళం!



గోపాలపట్నం వైపు వెళ్లే దారిలో ఫ్లైఓవర్ కింద పార్కింగ్ చేసిన వాహనాలు



ఘర్షణ పడుతున్న ద్విచక్ర వాహనదారులు

- వందలాది ద్విచక్ర వాహనాల పార్కింగ్
- రాకపోకలకు తీవ్ర అంతరాయం

విశాఖ విద్య: నగరంలో ఎన్ఏడీ ప్రధానమైన కూడలి. అటు గాజువాక, ఇటు ఆర్టీసీ బస్టాండ్, మరో వైపు పెందుర్తి, ఇంకో వైపు మర్రిపాలెం రైల్వే స్టేషన్ ఇలా నలువైపుల నుంచి వచ్చేవారు ఎన్ఏడీ సెంటర్ నుంచే రాకపోకలు సాగించాలి. ఎన్ఏడీకి సమీపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలోని ఇండస్ట్రియల్ కారిడార్(పారిశ్రామిక ప్రాంతం) కూడా ఉంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, ప్రత్యేకంగా ట్రాఫిక్ నియంత్రణకు వేర్వేరుగా పోలీసు వ్యవస్థ ఉంది. అయితే ఫ్లైఓవర్ కింద గోపాలపట్నం, ఆర్టీసీ బస్టాండ్ వైపు వచ్చే దారిలో ద్విచక్ర వాహనాలు వందల సంఖ్యలో పార్కింగ్ చేసి రోజుల తరబడి వదిలేయడంతో ఆ దారిలో రాకపోకలకు కొంత అసౌకర్యంగా ఉంది.

ఆ వాహనాలు ఎవరివో?

ఫ్లై ఓవర్ కింద పార్కింగ్ చేస్తున్న కొన్ని ద్విచక్ర వాహనాలు ఎవరివి అనేది తెలియని పరిస్థితి. దూర ప్రాంతాలకు రోజు వారీ విధులు నిర్వర్తించే వారి వాహనాలు కొన్ని ఉంటున్నాయి. అయితే కొన్ని వాహనాలు నెలల తరబడి అలానే ఉండిపోవడంతో వాటిని ఎవరు పార్కింగ్ చేశారు..? ఆ వ్యక్తులు ఏమయ్యారు..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

వాహనదారుల మధ్య వాగ్వాదం

ఫ్లై ఓవర్ కింద నుంచి గోపాలపట్నం వైపు వెళ్లే దారిలో ఎక్కువ సంఖ్యలో ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. ఇక్కడ అటు నుంచి ఇటు వైపు రోడ్‌కు ద్వి చక్రవాహనాలు రాకపోకలు సాగించేలా ఫ్లై ఓవర్ దిగువన మార్గం ఉంచారు. ఈ దారిని మూసేలా ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు చిన్న ఏమరపాటుతో ఉన్నా ఢీ కొట్టుకునే పరిస్థితులు ఉన్నాయి. రెండు రోజుల కిందట ఇక్కడ ఇలాంటి దృశ్యాలే కనిపించాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు తప్పుకున్న క్రమంలో ఢీకొట్టుకున్నారు. దీంతో వారి మధ్య పెద్ద వాగ్వాదమే సాగింది. అరగంటకుపైగా జనం గుమిగూడడంతో ట్రాఫిక్‌కు అవాంతరం ఎదురైంది.

దృష్టి పెడితే మేలు

ఎన్ఏడీ ఫ్లై ఓవర్ కింద పార్కింగ్ చేసిన వాహనాల్లో రోజుల తరబడి వదిలేసినవి ఎవరవనే దానిపై దృష్టి పోలీసులు దృష్టిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఏదైనా జరగరాని ఘటనలు సంభవించినప్పుడు హడావుడి చేసేబదులు ముందుగానే ఇలాంటి వాటిపై దృష్టి సారిస్తే మంచిదని ఎన్ఏడీ సెంటర్ వాసులు విన్నవిస్తున్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరం



మ్యూజికల్ చైర్ ఆడుతున్న చిన్నారులు

పెందుర్తి: పెందుర్తి శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం చిన్నారులకు కథలు చదవడం, రాయడం, చెప్పడం నేర్పించారు. అనంతరం ధ్యానం చేయించారు. సరదాగా ఆటలు ఆడుదాం కార్యక్రమంలో భాగంగా మ్యూజికల్ చైర్ ఆడించారు. దేశ భక్తి గీతాలపై పోటీలు నిర్వహించి..విజేతలుగా నిలిచిన చిన్నారులకు బహుమతులు అందించారు. గ్రంథాలయాధికారి బి.సూర్యకళ, విశ్రాంత ఉపాధ్యాయుడు ధనుంజయ్, గ్రంథాలయాభివృద్ధి కమిటీ ప్రతినిధులు పెతకంశెట్టి భూలోకరావు, ఆదారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యా కానుక కిట్ల పరిశీలన



పుస్తకాలను పరిశీలిస్తున్న జిల్లా ఉన్నతాధికారులు

పెందుర్తి: రానున్న విద్యా సంవత్సరంలో ప్రభుత్వం నుంచి విద్యార్థులకు అందించనున్న విద్యా కానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను జిల్లా ఉన్నతాధికారులు బుధవారం పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పంపిణీకి సిద్ధంగా ఉన్న కిట్లను పరిశీలించి విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు వాటిని పూర్తిస్థాయిలో అందించాలని సూచించారు. ఆర్జేడీ విజయ్‌భాస్కర్, డీఈవో చంద్రకళ, సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అదనపు కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహానికి ఆధునిక హంగులు



ఆధునికీకరించిన మరుగుదొడ్ల బ్లాక్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, తదితరులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని ఎస్సీ సంక్షేమ బాలురు వసతి గృహానికి ఆధునిక హంగులు సమకూర్చారు. రూ.38 లక్షల సీఎస్సార్ నిధులతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ పనులు జరిగాయి. 100 మంది విద్యార్థులు ఈ వసతి గృహంలో ఉండటంతో అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించారు. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టర్ మల్లికార్జున ఆయా పనులు జరిగిన తీరును పరిశీలించారు. వసతిగృహానికి పూర్తిస్థాయి మరమ్మతులతో పాటు మరుగుదొడ్ల నిర్మాణం, పెయింటింగ్ పనులు చేపట్టారు. ఆయా పనులను కలెక్టర్ పరిశీలించి, విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

క్లాక్ టవర్ పనులు పరిశీలించిన కమిషనర్



అధికారులకు సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



లేపాక్షి జంక్షన్ వద్ద సర్కిల్ నిర్మాణంపై సూచనలు చేస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్ : నగర సుందరీకరణలో భాగంగా జీవీఎంసీ జోన్ – 4 పరిధి జగదాంబ జంక్షన్‌లో నిర్మిస్తున్న క్లాక్ టవర్ పనులు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కూడళ్ల అభివృద్ధిలో భాగంగా జగదాంబ జంక్షన్‌లో ఆకర్షణీయమైన క్లాక్ టవర్ నిర్మిస్తున్నామన్నారు. పనులు దాదాపు పూర్తయ్యాయని, ఆకర్షణీయమైన రంగులు వేసి అందంగా తీర్చిదిద్ది, మిగిలిన పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జగదాంబ జంక్షన్ రోడ్డు సెంటర్ మీడియన్‌లో ఎత్తుపల్లాలు లేకుండా సమాంతరంగా చేసి ఆకర్షణీయమైన మొక్కలు నాటాలని పర్యవేక్షక ఇంజినీర్ వినయ్ కుమార్‌ను ఆదేశించారు. అనంతరం జగదాంబ జంక్షన్ నుంచి పాతపోస్టాఫీస్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులు పరిశీలించారు. లేపాక్షి జంక్షన్ వద్ద వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా సర్కిల్ నిర్మాణ పనులు చేపట్టాలని, అలాగే రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయడంతో పాటు కొత్త రోడ్డు జంక్షన్ వద్ద కల్వర్టు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని పర్యవేక్షక ఇంజినీరు పీవీవీ సత్యనారాయణరాజును ఆదేశించారు. పర్యటనలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

అరుదైన వృక్ష జాతుల నిలయం

- జీవ వైవిధ్య ఉద్యానవనంలో పుష్పాలు కనువిందు
- పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన విద్యార్థులు



ముళ్ల మొక్కపై పుష్పాల కనువిందు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు, నగరవాసులు



విరబూసిన మే ఫ్లవర్

ఏయూ క్యాంపస్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని స్థానిక జీవ వైవిధ్య ఉద్యానవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పలు కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. జీవ వైవిధ్య ఉద్యానవనాన్ని సరిగ్గా 22 సంవత్సరాల క్రితం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం రోజున ప్రారంభించామని నిర్వాహకుడు డాక్టర్ మంథా రామమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా డాల్ఫిన్ నేచర్స్ కన్జర్వేషన్ క్లబ్, యూనిటీ డిగ్రీ కళాశాల, సెయింట్ జోసఫ్ కాలేజ్ ఫర్ విమెన్ సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాయి. 100 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఔషధ మొక్కలను ఉద్యానవనం ప్రాంగణంలో నాటారు. మూడెకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ ఉద్యానవనంలో మూడు వేలకు పైగా మొక్కలు పెంచుతున్నారు. నేల మీద, నీటిలో, చెట్లపైన జీవించే మొక్కలు ఇక్కడ కనువిందు చేస్తున్నాయి. ఎడారిలో మాత్రమే పెరిగే ముళ్ల మొక్కలు సైతం వందలాదిగా ఇక్కడ మనంకు దర్శనమిస్తాయి.



ఉద్యానవనంలో వికసించిన పుష్పాలు

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో రమాబాయి, భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో కొలువుదీరిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో పసుపు నీటితో అభిషేకం నిర్వహించారు. అమ్మవారికి జలాభిషేకం చేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ముందుగా ఆలయ ఈవో రమాబాయి ఆధ్వర్యంలో ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి బిందెలతో పసుపు నీళ్లు తీసుకెళ్లి అభిషేకం చేశారు. ప్రధానార్చకుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకం జరిపారు. సాయంత్రం 5 గంటల నుంచి కూడా అమ్మవారికి గంధం నీటితో అభిషేకాలు చేశారు.